## భారతదేశంలో వికేంద్రీకరణ సంక్లిష్టతలు మరియు విశ్లేషణలు.

ఈ వ్యాసం భారతదేశంలో వికేంద్రీకరణను అమలుచేసే విధానాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తుంది. ఇందు కోసం, ఈ వ్యాసాన్ని రెండు భాగాలుగా విభజించటం జరిగింది. మొదటి భాగంలో, ప్రభుత్వం యొక్క విధి విధానాలలో వికేంద్రీకరణ ప్రాబల్యం మరియు స్వాతంత్ర్యం వచ్చిన గత 75 సంవత్సరాల కాలంలో వచ్చిన సంక్లిష్టతలను గురించి తెలుపుతుంది. రెండవ భాగంలో, వికేంద్రీకరణ మరియు దాని పరిధికి సంబందించిన ప్రశ్నలను అడిగేందుకు మార్గదర్శకాలను తెలుపుతుంది. రెండు భాగాలకు, రెండు అనుబంధాలు ఇవ్వబడ్డాయి. ఒకటో భాగానికి జత చేయబడిన అనుబంధంలో 'సమాఖ్య వ్యవస్థలో అవకతవకలు - సమస్యలు మరియు ప్రత్యామ్నాయాలు (2022)' అనే అంశంపై ప్రచురించబడిన రెండు వ్యాసాల సారాంశం చెప్పబడింది. రెండవ భాగానికి జత చేయబడిన అనుబంధంలో పౌరుల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాలను (CSS) విశ్లేషించడానికి ఒక సులభమైన అభ్యాసం జత పరచ బడింది. మరిన్ని పథకాల అమలులో స్థానిక సంస్థల ప్రమేయం పెంచడానికి కూడా ఇటువంటి విధి విధానాలు దోహదపడతాయి.

### భాగం I
### భారతదేశంలో వికేంద్రీకరణ

భారతదేశంలో వికేంద్రీకరణపై జరిగిన విశ్లేషణలో సంస్థలు మరియు ఏజెన్సీల మధ్య ఉన్న సంబంధాలు మరియు వాటి స్థాయిల సంక్లిష్టతలను తెలియచేస్తుంది. తగిన వికేంద్రీకరణ జరిగిందా లేదా అని తెలుసుకోవటం పౌరులకు కష్టతరమైనది. అసలు వికేంద్రీకరణ జరిగినా కూడా దానిని గుర్తించగలిగిన నమూనాలు లేదా ధోరణులు ఏవీ లేకపోవడం వలన అవి ఉన్నట్లు కనిపించవు.

2. మొదటగా 1919 భారత ప్రభుత్వ చట్టం, బ్రిటిష్ పాలన కలిగిన రాష్ట్రాలలో స్థానిక స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ చట్టం

యొక్క పరిధి నుంచి రాచరిక పాలన కలిగిన రాష్ట్రాలను మినహాయించారు. 1922 లో పంజాబ్‌లో పంచాయతీ చట్టం, మద్రాస్‌లో గ్రామ పంచాయతీ చట్టం, బెంగాల్‌లో స్వయం ప్రతిపత్తి గల ప్రభుత్వ చట్టం అలాగే 1925 లో ఉత్తర ప్రదేశ్ మరియు బెరార్‌లోని ముఖ్యమైన రాష్ట్రాలతో సహా, అనేక రాష్ట్రాలు శాసనాలను జారీ చేశాయి. 1935 భారత ప్రభుత్వ చట్టం, రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని మరియు ప్రభుత్వాలను ఎన్నుకునే వెసులుబాటును కల్పించింది. జిల్లా వ్యాప్తంగా పరిధిని కలిగి ఉండే డిస్ట్రిక్ట్ బోర్డ్ వ్యవస్థ బ్రిటిష్ రాజ్యంలో కూడా అధికారాలు మరియు విధుల వికేంద్రీకరణ వంటి అంశాల పైన ఆసక్తికరమైన దృష్టి సారించి ఈ దిశలో అభివృద్ధి సాధించింది. పరిమిత పరిధిలో ఎన్నికల ద్వారా ఎన్నుకోబడిన ఈ సంస్థల యొక్క విధులు మరియు అధికారాలు విస్తృతమైన అంశాలపై ప్రభావాన్ని కలిగి ఉంటాయి. వీటిలో ముఖ్యమైనవి, పబ్లిక్ రహదారుల మరియు ఇతర కమ్యూనికేషన్ మార్గాల నిర్మాణం, మరమ్మత్తు మరియు నిర్వహణ; పబ్లిక్ ఆసుపత్రుల మరియు డిస్పెన్సరీల నిర్వహణ మరియు సందర్శన, సరాయిలు మరియు పాఠశాలలు ఏర్పాటు, మరియు ఈ సంస్థలకు సంబంధించిన అన్ని భవనాల నిర్మాణం మరియు మరమ్మత్తు; ఉపాధ్యాయులకు శిక్షణ మరియు ఉపకార వేతనాలను ఏర్పాటు చేయడం; నిల్వ మరియు కాలుష్యం నుండి నీటిని రక్షించి, త్రాగు నీరు, వంట మరియు స్నానం వంటి ప్రయోజనాల కోసం నీటిని సరఫరా చేయటం, మొక్కలను నాటడం, చెట్లను రక్షించడం మరియు స్థానిక ప్రభుత్వాలకు సంబంధించిన అనేక ఇతర విధులను ఈ సంస్థలకు అప్పగించబడ్డాయి. ఈ సేవల ద్వారా రెవెన్యూని పెంచడానికి అధికారాలు ఇవ్వబడ్డాయి మరియు వీటికి బదిలీ చేయబడ్డ అంశాలకు ప్రాంతీయ ప్రభుత్వాల మద్దతు కూడా ఇవ్వడం జరిగింది.

3. దిగువ నుంచి ప్రారంభం అయ్యే వికేంద్రీకృత "పంచాయతీ రాజ్" ప్రభుత్వ నమూనాను రాజ్యంగంలో ఒక ప్రత్యేక భాగంగా చేర్చే అంశంపై రాజ్యాంగ సభ కూడా చర్చించింది. మహాత్మా గాంధీ ఆదర్శాల ప్రకారం స్వయం ప్రతిపత్తి గల గ్రామాలే భారత రాజ్యాంగానికి ఆధారాలు అని బలమైన అభిప్రాయం వ్యక్తం చేయడం జరిగింది. "మహాత్మా గాంధీ గారు సూచించినట్లు మన గ్రామాలలో ప్రాచీన వైభవాన్ని చూడగలిగేలా" కొంత స్థాయిలో స్థానిక-స్వయంసమృద్ధి కోసం అధికారాలను మరియు విధులను రాష్ట్రాలు వికేంద్రీకరణ జరపాలని చాల మంది అభిప్రాయం వ్యక్తం చేసారు. గ్రామ పంచాయితీలు పూర్వం ఉన్నట్లే ఇప్పటికీ "గ్రామ గణతంత్రాలు"గా ఉన్నాయనే ఊహ

ఉంది. కానీ ఈ ఊహ సరైనదేనా? డా. బి.ఆర్. అంబేద్కర్ పంచాయతీల కోసం ప్రత్యేక భాగాన్ని చేర్చవద్దని సూచించారు, ఎందుకంటే ఆయన ఉద్దేశం ప్రకారం, గ్రామం అంటే "అజ్ఞానం, మతతత్వం మరియు స్థానికతతో నిండి ఉన్న ప్రాంతాలు." గ్రామీణ సమాజంలో భూస్వాములు మరియు అగ్ర కులాలు, పంచాయితీలని, బలహీన వర్గాలను అణిచివేయడానికి మరియు దోపిడీకి ఉపయోగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక రాజీ మార్గంగా పంచాయతీరాజ్‌లను రాజ్యాంగంలోని IVవ భాగంలో ఆదేశ సూత్రంగా పొందుపరచారు, ఇది "గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసే చర్యలు తీసుకునేందుకు మరియు స్వీయ-ప్రభుత్వ యూనిట్లుగా పని చేయడానికి అవసరమైన అధికారాలను గ్రామ పంచాయితీలకు ఇవ్వటానికి రాష్ట్రాలు దోహదపడాలని ఆర్టికల్ (ఆర్టికల్ 40) లో చెప్పబడింది.

4. రాష్ట్ర ప్రభుత్వాలు వృత్తి పన్ను వేసేందుకు అనుమతించే నిబంధనలను కొనసాగించే విషయంలో రాజ్యాంగం స్థానిక సంస్థల ప్రాధాన్యతను గుర్తించింది. స్థానిక సంస్థల దయనీయ ఆర్థిక పరిస్థితితో పోలిస్తే వాటి నుండి ఆశిస్తున్న సేవలు, వాటికి అదనపు పన్నుల మూలాలను అందించే అవసరంపై దాదాపుగా ఏకాభిప్రాయ చర్చలను లేవనెత్తాయి. (రాజ్యాంగ సభ చర్చలు వాల్యూమ్. IX, తేదీ: ఆగస్ట్ 9, 1949). ఆ విధంగా, ఆర్టికల్ 276 నిబంధన ప్రకారం రాష్ట్రాలు స్థానిక సంస్థల అవసరాల కొరకు వృత్తి వ్యాపారాలు, ఉద్యోగాలపై విధించే పన్నులపై ఆర్టికల్ 246 లో పొందుపరిచిన ఆదాయ పన్నుకి సంబంధించినటువంటి నిబంధనలు వర్తించవు. అయితే, ఈ చర్చలోనే డాక్టర్.అంబేద్కర్, కొత్త రాజ్యాంగంలో వికేంద్రీకరణ ద్వారా స్థానిక సంస్థలు ఎంత వరకు స్థిరపడతాయి అనే పరిధిపై పరిమితిని విధించాలి అన్నారు. దీని గురించి ఇంకా, "రాష్ట్రాలు, స్థానిక అధికారాల మధ్య వనరులను పంపిణీ చేసే విషయం, రాష్ట్రాలు చేసే చట్టంపై ఉంటుంది, ఎందుకంటే స్థానిక అధికారం అనేది పూర్తిగా రాష్ట్రాల పరిధి లోనే ఉంటుంది. దీనికి అధికార పరిధి లేదు. ఈ ఆర్టికల్ ని ఎటువంటి ప్రయోజనాలకోసం ఐతే ఏర్పాటు చేసారో, ఆ ప్రయోజనాలు చేపట్టకపోతే దానిని రాష్ట్రం రద్దు చేయవచ్చు. స్థానిక సంస్థలకు ఇచ్చే ఆర్థిక వనరుల గురించి రాజ్యాంగం లో నియమం ఏది లేనప్పటికీ పైన ప్రతిపాదించిన ఆర్టికల్ సాధారణ నియమానికి మినహాయింపు.

5. వికేంద్రీకరణ రూపకల్పన గురించి మరియు ప్రణాళికలను అమలు చేయటం కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ముందస్తు కార్యాచరణ నియమాలను ప్రతిపాదించింది.

(i) అనుబంధ సూత్రం ఆధారంగా వేర్వేరు స్థాయిల పంచాయితీల బాధ్యతలపై స్పష్టమైన నిర్వచనం;

(ii) ప్రణాళిక అమలులో మహిళలతో సహా అందరిని భాగస్వామ్యులను చేయటం, ప్రత్యేకించి వివక్షతకు లోనైన వారు మరియు అట్టడుగు వర్గాలు;

(iii) నిబంధనలు లేని విధంగా తగిన నిధుల పంపిణీ;

(iv) అనుకూలత మరియు స్వయంప్రత్తిని ప్రోత్సహించటానికి పథకాలను క్రమబద్ధీకరించి, ఏకీకృతం చేయడం;

(v) స్థానిక ప్రభుత్వాలకు రెవెన్యూని పెంచుకునే తగిన అధికారాలను మరియు ఆచరణ సామర్ధ్యాన్ని పెంపొందించి తద్వారా వాటికి కేటాయించిన వనరుల నుంచి ఆదాయాలను అభివృద్ధి చేయటం మరియు

(vi) స్థానిక ప్రభుత్వాలు ప్రణాళికలను సమర్ధంగా రూపొందించడానికి మరియు అమలు చేయడానికి, వనరులను పెంచుకునేందుకు మరియు మూల్యాంకన కార్యక్రమాలను చేపట్టడానికి వీలు కల్పించేలా సరైన నిర్వహణ మరియు గణాంక సమాచార వ్యవస్థ నిర్వహణ.

6. స్వాతంత్రం వచ్చిన వెంటనే రెండు దశాబ్దాలలో, ప్లానింగ్ కమీషన్ అధ్వర్యంలో కేంద్ర ప్రణాళిక రాకతో ప్రత్యేకించి ఆర్ధిక, అభివృద్ధి ప్రణాళిక మరియు ఆర్ధిక పాలసీకి సంబంధించిన విషయాలలో కేంద్రీకరణ అమలులోకి వచ్చింది. ప్రభుత్వ రంగ నాయకత్వం వహించే ప్రణాళిక ప్రక్రియను అవలంబించడం, అభివృద్ధిని నియంత్రించడం మరియు పరిశ్రమల ఏర్పాటు, కేంద్రం నుంచి భారీగా వచ్చిన పెట్టుబడులతో మౌళిక పరిశ్రమలలో ఎక్కువ భాగం ప్రభుత్వ రంగానికి కేటాయించడం, (టాప్-డౌన్ ప్లానింగ్) అత్యున్నత స్థాయిలో చర్యలు మరియు నిర్ణయాలు తీసుకోవటం వల్ల రాష్ట్రాలు మరియు దిగువ స్థాయి సంస్థలు కేవలం అమలు చేసే ఏజెన్సీలుగా మిగిలాయి.

7. గ్రామీణ పునర్నిర్మాణానికి ప్రాధాన్యత పెరగటం వలన, మొదటి పంచవర్ష ప్రణాళికలో కమ్యూనిటీ డెవలప్మెంట్ (CD) బ్లాకులను ఏర్పాటు చేయడం ప్రారంభమైంది. ప్రతి జిల్లాను సుమారు 100 గ్రామాలతో “డెవలప్మెంట్ బ్లాకులు” గా

విభజించారు. ప్రారంభంలో ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నిధులను అందించేది కానీ తరువాత రాష్ట్రాలు కూడా ఖర్చులను పంచుకోవడం ప్రారంభమైంది. నిర్ణయాలను తీసుకోవడం మరియు అభివృద్ధి పథకాలను అమలు చేయడంలో ప్రజల భాగస్వామ్యం ఉంటుందని ఊహించారు.

8. పంచాయతీలపై బల్వంత్ రాయ్ మెహతా నివేదిక (1957) ఇలా సూచించింది, గ్రామ పంచాయితీలను నేరుగా ఎన్నుకున్న ప్రతినిధులతో ఏర్పాటు చేయాలి, పంచాయతీ సమితి మరియు జిల్లా పరిషత్‌ను పరోక్షంగా ఎన్నుకున్న సభ్యులతో ఏర్పాటు చేయాలి, మరియు వీటికి ప్రణాళిక మరియు అభివృద్ధి కార్యకలాపాలను అన్నిటినీ అప్పగించాలి. దేశవ్యాప్తంగా రాష్ట్రాల స్పందన వేర్వేరుగా ఉంది. కొన్ని రాష్ట్రాలు బి.ఆర్.మెహతా నమూనాని అనుసరించాయి, కానీ అనేక ఇతర రాష్ట్రాలు వికేంద్రీకరణ లేకుండా తమ స్వంత కార్యాచరణను అమలు చేసాయి. 1969 వరకు ప్రణాళికా సంఘం కూడా ఎటువంటి జిల్లా స్థాయి ప్రణాళిక మార్గదర్శకాలను ప్రకటించలేదు.

9. కేంద్ర మరియు రాష్ట్రాల మధ్య పన్నులను పంచడానికి మరియు గ్రాంట్-ఇన్-ఎయిడ్‌లకు మొదటి ఆర్థిక సంఘము (Finance Commission) ప్రాథమిక నియమాలను రూపొందించింది. మొదటి కమిషన్ సిఫారసు ప్రకారం కేటాయింపులు మరియు గ్రాంట్ల మిశ్రమంగా రాష్ట్రాలకు రెవెన్యూ మిగులు (రెవెన్యూ లోటు లేని) ఉండటమే కీలక నియమం. కేంద్రము మరియు రాష్ట్రాలు రెండిటి మూలధన అవసరాలు ప్రధానంగా అప్పు తీసుకున్న నిధులతోనే తీరాలి అని కూడా ఇది స్పష్టంగా పేర్కొంది. మూడవ ఆర్థిక సంఘము (FC) లో అసమ్మతి నోట్‌ను ఆమోదించడం వలన, ఆర్థిక సంఘాల పాత్రను ప్రణాళికేతర ఖాతాకి మరియు ప్రణాళికా గ్రాంట్లను ప్రణాళిక సంఘానికి (PC) పరిమితం చేసింది. ఇది రెవెన్యూ సమతుల్య వ్యవస్థను మార్చటమే కాకుండా స్థిరమైన పబ్లిక్ ఫైనాన్స్ కోసం రెవెన్యూ నిల్వలను నిర్వహించడానికి అవసరమైన ఆర్థిక క్రమశిక్షణను తొలగించటం వలన అది తదుపరి ఆర్థిక సంఘముల పాత్రను తగ్గించింది.

10. డెబ్బై, ఎనభైలలో బహుళ-స్థాయి ప్రణాళిక విధానాన్ని అవలంబించవలసిన అవసరాన్ని గుర్తించారు. 1969లో జిల్లా ప్రణాళిక కోసం నిర్దిష్ట మార్గదర్శకాలను చేసింది.

కొన్ని రాష్ట్రాలు జిల్లా స్థాయి ప్రణాళికా ప్రక్రియతో లేదా కొన్ని జిల్లాలను కలిపి ఒక పెద్ద భౌగోళిక ప్రాంతంగా కలిపి, ప్రాంతాలవారీగా వికేంద్రీకరణ విధానాన్ని అవలంబించాయి. జాతీయ స్థాయిలో, గిరిజన ప్రాంతాల కోసం గిరిజన అభివృద్ధి (ట్రైబల్ డెవలప్మెంట్ (TD)) కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు (ఇంటెన్సివ్ అగ్రికల్చరల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (Intensive Agricultural Development Programme-IADP)), కరువు పీడిత ప్రాంతాల అభివృద్ధి (Drought Prone Area Programme - DPAP) ద్వారా కరువు ప్రాంతాలే లక్ష్యంగా వాటి సమస్యలు పరిష్కరించబడ్డాయి, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడానికి, సాగునీటి కోసం కమాండ్ ఏరియా అభివృద్ధి కార్యక్రమం (CADP) మరియు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (District Rural Develoment Agency (DRDA)) ఏర్పాటు చేయబడ్డాయి. కేంద్ర మరియు రాష్ట్రాల ఉమ్మడి యాజమాన్యంతో కొత్త రకం సొసైటీలుగా పిలిచే ప్రత్యేక ఏజెన్సీల నిర్వహణకు బడ్జెట్ నుండి నిధులు వస్తాయి కానీ బడ్జెట్ నిబంధనలకు వెలుపల వీటిని  నిర్వహిస్తారు. ఉదాహరణకు DRDAలను, జిల్లా స్థాయిలో పనిచేయటానికి  రూపొందించబడ్డాయి, కానీ కేంద్రం రూపొందించిన పేదరిక నిర్మూలన మరియు గ్రామీణ అభివృద్ధి వంటి పథకాలను అమలు చేయడానికి కూడా DRDAలు  ఉపయోగపడతాయి.

11. క్రింది పట్టికలో, మన దేశంలో బహుళ-స్థాయి ప్రణాళికలను పొందుపరచడానికి చేసిన వివిధ ప్రయత్నాలు వెల్లడించబడ్డాయి:

| సంవత్సరం | అంశం | ఆలోచనలు మరియు భావనలు |
|---|---|---|
| మొదటి ప్రణాళిక 1951-56 | సామాజిక అభివృద్ధి బ్లాకులు | జాతీయ, రాష్ట్ర, జిల్లా మరియు స్థానిక కమ్యూనిటీ స్థాయిలలో ప్రణాళికా పద్ధతిని విభజించడం. |
| రెండవ ప్రణాళిక 1956-61 | జిల్లా అభివృద్ధి కౌన్సిళ్ళు | గ్రామ ప్రణాళికలను రూపొందించడం మరియు ప్రజాస్వామిక వికేంద్రీకరణ ప్రక్రియ ద్వారా ప్రణాళికలో భాగస్వాములు కావడం. |
| 1957 | బల్వంత్ రాయ్ మెహతా కమిటీ | గ్రామ, బ్లాకు, జిల్లా పంచాయతీ సంస్థలు ఏర్పాటయ్యాయి. |
| 1967 | పరిపాలనా సంస్కరణల కమీషన్ | ఇవ్వవలసిన వనరులు/స్థానిక వైవిధ్యాలను సర్దుబాటు చేయటం, ప్రాంతాల కోసం ఉద్దేశించిన ప్రణాళిక. |
| 1969 | ప్రణాళిక సంఘం | రూపొందించిన మార్గదర్శకాలు: జిల్లా ప్రణాళికను మరియు వార్షిక, మధ్యకాలిక ప్రణాళికలను రూపొందించిన పద్ధతిని వివరంగా తెలియజేసింది. |
| 1978 | ప్రొఫెసర్ ఎమ్.ఎల్. దంత్‌వాలా | గ్రామం మరియు జిల్లా స్థాయి ప్రణాళికల మధ్య అనుసంధానం ఏర్పరచడానికి బ్లాక్ స్థాయి ప్రణాళిక. |
| 1983-84 | కేంద్ర ప్రాయోజిత పథకం /రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | జిల్లా ప్రణాళిక/జిల్లా ఋణ ప్రణాళికలను బలోపేతం చేయడం |
| 1984 | హనుమంత రావు కమిటీ | విధులు, అధికారాలు మరియు ఆర్థిక అంశాల వికేంద్రీకరణ, జిల్లా ప్రణాళికా వ్యవస్థలు మరియు జిల్లా ప్రణాళికా సెల్స్‌ను ఏర్పాటు చేయడం. |
| 1985 | జి.వి.కె. రావు కమిటీ | గ్రామీణాభివృద్ధికి పరిపాలనా ఏర్పాట్లు, అన్ని అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి జిల్లా పంచాయతీల ఏర్పాటు. |

12. ఈ సమయంలోనే బీమా, ప్రధాన వాణిజ్య బ్యాంకులు, బొగ్గు గనులు, విమానయానం మొదలైనవి జాతీయం చేయటం వలన వాటిపై ప్రభుత్వ రంగ ఆధిపత్యం విస్తరించడాన్ని చూడగలిగాము. ఆర్థిక పాలసీ కేంద్రీకరణ చేయటం వలన మొత్తం

ప్రభుత్వ వ్యయంలో రాష్ట్రాల వాటా తగ్గకపోయినా, దీనిపై కేంద్ర ప్రభావం ఎక్కువగా ఉంది, ఎందుకంటే కేంద్ర ప్రణాళిక లక్ష్యాలను కొనసాగించడానికి రాష్ట్రాలు తమ స్వంత ప్రణాళికను రూపొందించాలి మరియు వారి పంచవర్ష మరియు వార్షిక ప్రణాళికలను ప్రణాళిక సంఘముచే ఆమోదింపజేసుకోవాలి. రాష్ట్ర విభాగాలు, జిల్లాలు, బ్లాకులు మరియు స్థానిక ప్రభుత్వాలు ప్రధానంగా ఈ కార్యక్రమాలకు ఏజెన్సీలుగా పని చేస్తాయి.

13. 1991 సంస్కరణలను పూర్తిగా కేంద్ర స్థాయిలో అమలు చేశారు. మార్కెట్ల పాత్ర పెరుగుతుండటంతో, ప్రైవేట్ రంగంతో వ్యవహరించే విషయంలో కేంద్ర మరియు రాష్ట్రాల పరస్పర సంబంధాలను ఈ సంస్కరణలు ప్రాథమికంగా మార్చాయి. భారీ సంఖ్యలో కేంద్ర మంత్రిత్వ శాఖలు మరియు ఏజెన్సీలు అంతకు ముందు కలిగి ఉన్న అధికారాలను నియంత్రణ ఏజెన్సీలకు బదిలీ చేయటం, పరిశ్రమల ఏర్పాట్లకు నిబంధనలను మరియు కొన్ని సంస్థలను లైసెన్సింగ్ విధివిధానాల నుంచి మినహాయించటం, ప్రైవేట్ వ్యవస్థాపకతకు ప్రోత్సాహం, PSEలలో ప్రభుత్వ పెట్టుబడులను తగ్గించటం ఈ సంస్కరణల ద్వారా వచ్చినటువంటి మార్పులు. పబ్లిక్ - వస్తువులు మరియు ఉత్పత్తి కారకాలు - భూమి, కార్మిక చట్టాలు, విద్యుత్, పోలీస్ మరియు శాంతి భద్రతల విషయాలలో ఎక్కువగా రాష్ట్రాలు బాధ్యత వహిస్తాయి. కేంద్రంతో పోలిస్తే ప్రైవేట్ రంగం రాష్ట్రాలపై ఎక్కువగా ఆధారపడతాయి. ఈ మార్పు వలన ఆర్థిక స్థితిగతులకు బలం చేకూరింది. ఇటువంటి ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాల (PPP) వలన, కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ విధులను నిర్వర్తించడానికి ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలు ఉమ్మడిగా పాల్గొంటాయి.

14. 1993లో 73వ మరియు 74వ రాజ్యాంగ సవరణలు స్థానిక స్వయంప్రతిపత్తి ప్రభుత్వాలకు రాజ్యాంగ హోదాను కల్పించాయి మరియు అట్టడుగు స్థాయి నుండి వికేంద్రీకరణ ప్రణాళిక కోసం మరింత రాజకీయ ఆధారంగా కొత్తగా ఒక వేదికను అందించడానికి, దీన్ని రూపొందించారు. రాజ్యాంగంలోని XI షెడ్యూల్ గ్రామీణ స్థానిక సంస్థలకు 29 విస్తృత రంగాలను బదిలీ చేయాలని సూచించింది. అదేవిధంగా XII షెడ్యూల్, 18 విస్తృత రంగాలను పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేసి దీని ద్వారా పంచాయితీలు మరియు మునిసిపాలిటీలు స్వీయ-ప్రభుత్వ సంస్థలుగా ఎదగటానికి అవకాశాలని కల్పించారు. అయితే, రెండు షెడ్యూళ్లలో పేర్కొన్న విధుల విభజన, రాష్ట్రాలు చేసే చట్టాలపైన ఆధారపడి ఉంటుంది. (ఆర్టికల్ 243 G మరియు 243 W).

ఎన్నికలు నిర్వహించడం వంటి తప్పనిసరి నిబంధనలలో కొన్నిటి అమలులో పురోగతి ఉన్నప్పటికీ, స్థానిక ప్రభుత్వాలకు అధికారాల పంపిణీ మరియు సరైన నిధుల సౌకర్యం ఉన్న కొన్ని రాష్ట్రాలలో కూడా అభివృద్ధి ప్రణాళిక భావన ఇప్పటికీ మొదలు అవ్వలేదు. XI మరియు XII షెడ్యూళ్లలో స్థానిక సంస్థల విధులను పేర్కొన్నప్పటికీ ఈ విధులను వివిధ పథకాలుగా విభజించటం వలన స్థానిక సంస్థలు ఈ విధుల అమలులో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవటానికి వెసులుబాటు లేదు. ఈ కారణాల వలన స్థానిక సంస్థలు రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల పథకాలను అమలు చేయటానికి పరిమితమైనాయి. రెండవది, రాష్ట్ర ప్రభుత్వాల రాష్ట్ర ఆర్థిక సంఘము (SFC) ను సరైన సమయంలో ఏర్పాటు చేయటం లేదు, మరియు వీటిని బలోపేతం చేయటానికి సరైన ప్రాముఖ్యతను కూడా ఇవ్వలేదు. మూడవది, గ్రామీణ స్థానిక ప్రభుత్వాలకు రెవెన్యూ పెంచుకునేందుకు ప్రోత్సాహం అందించలేదు. బదిలీ చేసిన వాటిలో ఎక్కువ భాగం పథకాల అమలులో కాంట్రాక్టర్ల యొక్క ప్రమేయం ఎక్కువగా ఉన్నది.

15. 2014లో ప్రణాళికా సంఘాన్ని రద్దు చేయడంతో మరియు రాష్ట్రాలకు అధికంగా నిధులను పంపిణీ చేయాలని నిర్ణయిస్తూ 14వ ఆర్థిక సంఘము (FC) ఇచ్చిన అవార్డ్‌ను 15వ ఆర్థిక సంఘము (FC) కూడా కొనసాగించటంతో నిర్మాణాత్మక మార్పు జరిగింది. ప్రణాళిక సంఘం నియంత్రించే ప్లాన్ రెవెన్యూ వ్యయంలో ఎక్కువ భాగం రాష్ట్రాల పన్ను వాటాలో చేర్చారు, తద్వారా నిబంధనలు లేని ఫార్ములా-ఆధారిత బదిలీలను పెంచారు. ఇది తమ విధానాలను మరియు వ్యయ అవసరాలను అంచనా వేయటానికి రాష్ట్రాలకు అనుకూలతను ఇచ్చింది. రాజ్యాంగం ప్రకారం మరియు చట్టప్రకారం 14వ ఆర్థిక సంఘము (FC) స్థానిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతగా గుర్తించింది. ఇది స్థానిక సంస్థలకు ఆంక్షలు లేని గ్రాంట్‌లను సమకూర్చింది. దీనివలన షరతులతో కూడిన కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ల వలన వికేంద్రీకరణ తగ్గుముఖం పట్టింది. ఈ గ్రాంట్లను స్థానిక సంస్థల మౌళిక సదుపాయాలకొరకు రాష్ట్ర చట్టాల ప్రకారం వినియోగిస్తాయి. దీని నుండి వైదొలుగుతూ, కొన్ని భాధ్యతలు దేశ అవసరాలని దృష్టిలో ఉంచుకొని స్థానిక సంస్థలు నిర్వహించవలసి ఉంటుందని ఆర్థిక సంఘము అభిప్రాయ పడింది. బదిలీ చేసిన వనరులలో దాదాపుగా 60 శాతం షరతులతో కూడుకున్నవే. ఈ వనరులు ఆర్థిక సంఘాలు నిర్దేశించే పథకాల పైన మరియు కేంద్ర ప్రభుత్వ పథకాల పైన ఖర్చు చేయాల్సి ఉంటుంది.

16.  మిగితా బదిలీలు షరతులు విధించినవి. ఈ విధంగా నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఎక్కువగానే వుంది. ఈ పద్ధతి వికేంద్రీకరణకు మరియు సహకార సమాఖ్య సిద్ధాంతానికి విరుద్ధం.

17.  విస్తృత పరిశోధన మరియు అనేక అధ్యయనాల తరువాత మార్టినెజ్-వాజ్క్వెజ్ జార్జ్ మరియు మెక్నాబ్ (2003: ప. 1608) తమ అభిప్రాయాన్ని ఈ విధంగా వ్యక్తం చేశారు, "…. వికేంద్రీకరణ వృద్ధిపై ఎలా ప్రభావం చూపుతుంది అనే విషయం ప్రస్తుతానికి చాలా స్పష్టత లేదు. కాబట్టి, ఈ విషయంలో ప్రస్తుతానికి సలహాలను ఇవ్వలేము. వికేంద్రీకరణ కేంద్రీకృత పబ్లిక్ వ్యయం కన్నా ఆధిక్యత ఏ రకంగానూ స్పష్టంగా లేదు". భారతదేశంలో వికేంద్రీకరణ లేదా కేంద్రీకరణ చర్యను విశ్లేషించడంలో క్లిష్టతలను వివరించడానికి మరియు వాటి సంబంధిత ప్రయోజనాల సరైన ఫలితాన్ని సాధించడానికి తీసుకోవలసిన చర్యల గురించి తెలియచేయడానికి ప్రస్తుత సమాఖ్య నిర్మాణంపై రెండు అధ్యయనాలు మరియు ఒక వ్యాఖ్య జోడించబడ్డాయి. ఇవి అనుబంధం-I లో క్లుప్తంగా ఇవ్వబడ్డాయి.

18.  కేంద్రం మరియు రాష్ట్రాల మధ్య 'ఇచ్చి పుచ్చుకునేందుకు' తగిన అవకాశంతో పాటు బాగా పని చేసే 'అనుకూలవంతమైన సమాఖ్య' నిర్మాణం కోసం అవసరమైన ముందస్తు-షరతుగా సామరస్య పూర్వక అంతర-ప్రభుత్వ విధాన సంప్రదింపులు ఉండాలని ప్రొఫెసర్ సురేష్ బాబు గారి యొక్క వాదన. వేగవంతమైన ఆర్థిక వృద్ధిని సాధించటానికి, సామరస్యపూర్వక సమాఖ్య సంబంధాలను నిలుపుకోవడం ముఖ్యం. ఇది "కేంద్రానికీ, రాష్ట్రాలకూ రెండిటికీ ప్రయోజనం అందించే పరిస్థితులకు మార్గాలను తెరుస్తుంది." కేంద్ర ఆధిపత్యంపై రాష్ట్రాల నుంచి పెరుగుతున్న సవాళ్ళతో, బలమైన ప్రాంతీయ పార్టీల మరియు సంకీర్ణ రాజకీయాల కాలంలో, పరిపాలనకు సంబంధించిన విధానాలు, నియంత్రణ విధానాలలో సమస్యలు మరియు కేంద్రం ప్రకటించిన కొన్ని పథకాలు/కార్యక్రమాలను నిరోధించడానికి రాష్ట్రాలకు కల అధికారాలను ఆయన విశ్లేషించారు. సామరస్యపూర్వక సమాఖ్య వ్యవస్థ కోసం ముందస్తు అవసరమైన పరస్పర విశ్వాస వాతావరణాన్ని నిర్మించడానికి నిరంతరం రాష్ట్రాలతో సమబంధం కలిగి ఉండాలని కేంద్రాన్ని కోరుతూ, రాష్ట్రాలు తీసుకోవలసిన అనేక సంస్కరణ చర్యలు మరియు విధానాలను సూచించారు.

19. సురేష్ బాబు గారి విశ్లేషణపై ఎం. గోవిందరావు ఇలా స్పందించారు. సహకారం వలన అన్ని పార్టీలు ప్రయోజనం పొందితే స్వచ్ఛంధంగా సహకారాన్ని పొందవచ్చు. "కొంతమందికి లాభం కలిగి ఇతరులకు నష్టం కలిగితే, లేదా, కొందరు వ్యక్తులకు, ఇతరుల కంటే ఎక్కువ లాభం కలిగితే, లాభం పొందినవారు సహకారం అందించడానికి అంగీకరించడం ద్వారా నష్టం పొందిన వారికి పరిహారం అందించవచ్చు అని ఆయన అభిప్రాయపడ్డారు. మరో విధంగా చెప్పాలంటే, ప్రజాస్వామ్యంలో 'సహకారాన్ని' నిర్ధారించడంలో సవాళ్ళు ఉంటాయి. సహకారం సాధ్యమయ్యే రంగాలలో ప్రభుత్వాల మధ్య సహకారాన్ని చర్చలు మరియు వివాద పరిష్కారాలను ప్రోత్సహించడానికి, ప్రారంభించడానికి సంస్థాగత యంత్రాంగం అవసరం." భారతదేశంలో ఇది లేదు. ఆర్టికల్‌లో ప్రొఫెసర్ సురేష్ బాబు లేవనెత్తిన సమస్యలను, కేటాయింపు వ్యవస్థలు లేదా సంస్థాగత యంత్రాగాలను సమీక్షించడం ద్వారా లేదా కోర్టులకు సూచించడం ద్వారా పరిష్కరించవచ్చు. "నిర్దిష్ట ప్రయోజన బదిలీ" పథకాల కోసం, ఈ ఆర్టికల్‌లో ప్రొఫెసర్ సురేష్ బాబు లేవనెత్తిన చాలా సమస్యలను కేటాయింపు వ్యవస్థలు లేదా సంస్థాగత యంత్రాగాలను సమీక్షించడం ద్వారా లేదా కోర్టులకు సూచించడం ద్వారా పరిష్కరించవచ్చు. ప్రొఫెసర్ రావు తన గురుతుల్యుడైన రాజా చెల్లయ్య చేసిన వ్యాఖ్యను "ప్రతి ఒక్కరికీ వికేంద్రీకరణ కావాలి, కానీ కేవలం తన స్థాయిలో మాత్రమే" అని ఉదహరించారు.

20. ప్రొఫెసర్ నిర్వికార్ సింగ్ యొక్క శీర్షికలో కేంద్ర-రాష్ట్ర సంబంధాల సమాఖ్య కోణంలో కోవిడ్-19ను ఎదుర్కోవడంలో భారతదేశ ప్రతిస్పందన గురించి అధ్యయనం చేశారు. వివిధ అధ్యయనాలు మరియు 24 దేశాల నుంచి తీసుకున్న ఉదాహరణల ఆధారంగా, మహమ్మారి వచ్చిన సందర్భంలో ప్రభుత్వాల మధ్య సహకార ప్రాముఖ్యతను, ఆ సహకారంలో ఉన్న గొప్ప వైవిధ్యాన్ని గురించి ఆయన బలంగా చెప్పారు. అనేక రాష్ట్ర, నగర మరియు గ్రామీణ స్థానిక ప్రభుత్వాలు కూడా మహమ్మారిని ధైర్యంగా ఎదుర్కొన్నాయి. కాంటాక్ట్ ట్రేసింగ్, స్థానిక లాక్ డౌన్‌లు, టెస్టింగ్ వంటి చర్యలు తీసుకున్నాయి. వివిధ స్థాయిల ప్రభుత్వాల మధ్య చర్యలు మరియు సమన్వయాల వంటి అనేక వివరాల గురించి జాగ్రత్త పడ్డారు అని కేంద్ర ప్రభుత్వ పాత్ర పైన ఆయన ఈవిధంగా అభిప్రాయపడ్డారు. మహమ్మారి మొదటి దశలో కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రయోజనకరంగా ఉండే విధానాలను రూపొందించడం, అధికారం మరియు

సమాంతరమైన ప్రయోజనం ఉన్నచోట చర్యలు తీసుకోవడం, అత్యవసర ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత సంరక్షణ సామగ్రి (PPEలు) వైద్య సరఫరాల ఉత్పత్తి, టీకాల అభివృద్ధి మరియు ఉత్పత్తిని ప్రోత్సహించడం వంటి చర్యలను చేపట్టి తన బాధ్యతలను నిర్వర్తించింది అని కేంద్ర ప్రభుత్వ పాత్ర గురించి ఆయన చెప్పారు. అయితే, ప్రత్యేకించి రాష్ట్రాల ప్రమేయం ఉన్నప్పుడూ వివరణాత్మకంగా అనుసరించే అంశాలలో ఇది విఫలం అవుతుంది.”

21. ఇక్కడ ఇచ్చిన అంశాలు, ఉదాహరణలు మరియు అధ్యయనాలు, వికేంద్రీకరణ పరిధిని మరియు ప్రయోజనాలను కొలవడానికి విలువైన పద్ధతులను తెలుపుతుంది. కేంద్రీకృత విధానం మరియు వికేంద్రీకరణ విధానాల విశ్లేషణ మరియు సరైన ప్రశ్నలను అడగడం ద్వారా అవగాహనాపూర్వక పద్ధతిని ఎంపిక చేసుకోవటమనేది సమస్య. రెండవ భాగంలో సమస్యలను నిర్ధారించడానికి విధానాలను తెలియజేయటమైనది. ఇవి అందరికీ ప్రయోజనాన్ని కలిగించేలా వికేంద్రీకృత పాలన ఉండగలిగే రంగాలను అంచనా వేసి విశ్లేషించడంలో పౌరునికి మేలు చేస్తుంది.